# ఫొటో

"రజనీ! ఇల్లంతా నీట్‌గా సర్దేసెయ్. డెకరేటివ్ పీసెస్‌ని శుభ్రంగా తుడిచెయ్. మనింట్లోని ప్రతీదీ రిచ్‌గా గొప్పగా కన్పించాలి సుమా" అన్నాడు శ్రీధర్ హడావిడి చేస్తూ.

"ఎవరైనా గెస్ట్స్ వస్తున్నారా" చిన్నగా నవ్వుతూ అడిగింది రజని.

గొప్పల్ని ప్రదర్శించుకోవడం అతడికి అత్యంత ఇష్టమైన సంగతని ఆమెకి బాగా తెలుసు.

" మా తాబేలు మాస్టారొస్తున్నారు..."

"అంటే హైస్కూల్లో మీ క్లాస్ టీచర్..."

"ఆయనే. ఆయన తాబేలులా గుణగుణ నడవటమే కాదు మమ్మల్నీ అలాగే వుండమని చెవులు మెలేసే వారు. అఫ్‌కోర్స్! మేం వినేవాళ్లం కాదనుకో. ఆయన మాటలు వినకపోయినా నేనెంత ఉన్నతస్థితికి చేరుకున్నానో ఆయన సిద్ధాంతాలు ఎంత తప్పో ఆయనకిప్పుడు తెలిసిరావాలి"

"బావుంది. చిన్నప్పటి మాస్టారితో పోటీయా!"

"ఒకరకంగా పోటీయే. నా విజయహాసాన్ని ఆయనకి చూపించి ఫోజుకొట్టొద్దూ. రేపు మార్నింగే వెళ్లి మాస్టార్ని రిసీవ్ చేసుకుని తీసుకొస్తాను. నువ్వు కూడా మెరుపుతీగలా మెరిసిపోవాలి సుమా" అన్నాడు శ్రీధర్.

" మీ భార్య అందగత్తె అని అంతా చెప్పుకోవాలంటారు"

"చెప్పుకున్నా లేకున్నా నేను యమ లక్కీఫెలోని అని అనుకుంటే చాలు" అన్నాడు.

"పాపం ఎంత చిన్న ఆశో!" సరదాగా నవ్వేసింది.

✣ ✣ ✣

శ్రీధర్ మారుతి సికింద్రాబాద్ స్టేషన్లో ప్రవేశిస్తోంటే నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం మీదకొచ్చి ఆగింది.

చిన్నగా ఈల వేసుకుంటూ కీచెయిన్ తిప్పుతూ ప్లాట్‌ఫాం మీదికెళ్లాడు శ్రీధర్.

"హాయ్... మాస్టారూ... ఇక్కడ..." అంటూ పెద్దగా అరిచి మాస్టార్ని పిలిచాడు.

అతడ్ని చూసి సంతృప్తిగా నిట్టూర్చి పలకరింపుగా నవ్వుతూ సమీపించారు మాస్టారు. "వస్తావో రావో అనుకున్నాను. పెద్దవాడియ్యావుకదా."

"నేను ఎంత ఎత్తుకి ఎదిగినా మీ శిష్యుడ్నే కదా మాస్టారూ"

"వూవూ మాటలు బాగా నేర్చావు. హైదరాబాదు నీళ్లు బాగా వంటబట్టినట్టున్నాయి. నువ్వొచ్చి చాలాసేపయ్యిందేవిట్రా శ్రీధరం. బండి బాగా ఆలస్యంగా వచ్చింది" అన్నారు మాస్టారు.

"లేదు మాస్టారూ. ఇప్పుడే వస్తున్నాను" అన్నాడు శ్రీధర్.

ఆశ్చర్యంగా చూశారాయన "ఆఖరి నిమిషందాకా నిమ్మకి నీరెత్తినట్టు కూర్చుని ఆఖర్న ఉరుకులు పరుగులు పెట్టడం ఇంకా మానలేదన్నమాట"

"పరుగెత్తి పాలుతాగే జనరేషన్ కదా మాది" నవ్వుతూ కారుని సమీపించాడు శ్రీధర్.

"ఈ కారు నీదేనా?" అడిగారు మాస్టారు.

"అవును మాస్టారూ..."

డోర్ తీయగా ఎక్కి కూర్చున్నారాయన.

"బావుందిరా శ్రీధరం"

చకచకా గేర్లు మార్చాడు శ్రీధర్. గాలిని చీల్చుకుంటూ దూసుకుపోతోంది మారుతి.

"అవతల కొంపలేవో మునిగిపోతున్నట్టు అంత వేగం ఎందుకురా శ్రీధరం. నెమ్మదిగా వెళ్ళొచ్చుకదా"

"మజా వుండదు మాస్టారూ. అయినా మారుతిని ఒంటెద్దు బండిలా తోలడం నాకిష్టముండదు."

"నిదానం ప్రధానం అన్నారు పెద్దలు"

"ఆ పెద్దలే ఆలస్యం అమృతం విషం అని కూడా అన్నారు కదా మాస్టారూ."

"పిడుక్కీ బియ్యానికీ ఒకే మంత్రమంటే ఎలారా. సమయ సందర్భాన్నిబట్టి తగిన నిర్ణయం తీసుకోవాలి గాని!"

"ఇప్పుడంతా అన్నిటా ఫాస్ట్ మాస్టారూ. పేదరాశి పెద్దమ్మ కబుర్లకి స్థానమూ లేదు వాటి గురించాలోచించే తీరికా లేదు."

"ఏవిటో! మీ పరుగులూ పద్ధతులూ ఒక పట్టాన అర్థంకావు కదా" అన్నారాయన.

కించిత్తు గర్వంగా నవ్వుకుంటూ చకచకా వాహనాల్ని దాటిస్తూ సడన్‌గా బ్రేక్‌వేస్తూ సర్రున కోస్తూ పదినిమిషాల్లో ఇంటికి తీసుకెళ్లాడు.

"హమ్మయ్య! గమ్యం చేర్చావుకదా. ఎప్పుడే ప్రమాదం మీద పడుతుందోనని హడలిపోయాననుకో. నా మాటవిని సర్కస్ ఫీట్లకి స్వస్తి చెప్పి తిన్నగా కారు నడపడం అలవాటు చేసుకోరా"

"తరాల అంతరం అంటే ఇదే మాస్టారూ..."అంటూ శ్రీధర్ ముందుకడుగేసేసరికి మాస్టారికి అతన్ని అనుసరించక తప్పలేదు.

అంజలి ఘటించి ఆహ్వానించింది రజని.

"బాగున్నావామ్మా. ఎప్పుడో పెళ్లిలో చూశాను..."

"ప్రయాణం బాగా సాగిందా బాబాయిగారూ."

"ఆc ఆc...బాగానే సాగిందిగాని రైలు కుదుపుకి నాకు సరిగా నిద్ర పట్టదమ్మాయ్..."

"నేను మాత్రం గుర్రుపెట్టి మరీ హాయిగా నిద్రపోతాను" అన్నాడు శ్రీధర్.

"నీ వయస్సుతో నేనెక్కడ పోటీ పడగలన్రా."

"ఆయన మాటలకేంగానీ మీరు కాళ్లు కడుక్కోండి బాబాయిగారూ. అదే బాత్‌రూం." అంది రజని.

కాళ్లు కడుక్కునొచ్చి అపార్ట్‌మెంటుని కలయజూస్తూ అన్నారు మాస్టారు "పోర్షన్ చిన్నదైనా ముచ్చటగా బావుందమ్మా. అద్దె ఎంతోయ్ శ్రీధరం"

"స్వంతమే మాస్టారూ. ఆ మధ్య ఇంటాయన అవసరానికమ్మేస్తే కొనేశాను.."

ఆయన అతడివంక అర్థం కానట్టూ కించిత్తు అనుమానంగానూ చూశారు.

"మీ అత్తవారేమైనా డబ్బు సర్దారా?"

"అబ్బే. పుచ్చుకునే పరిస్థితిలోనేగాని పెట్టేస్థితిలో లేరు వాళ్లు"

"మరి..ఉద్యోగంలో చేరి నాలుగైదేళ్లు మించదేమో. జీతం ఎంతేవిటి?"

"జీతానికి జీవితానికి ముడిపెడితే విటమిన్ యమ్ మిస్సవుతుంది మాస్టారూ" నవ్వేశాడు శ్రీధర్.

---

ఫోటో

ముసి ముసిగా నవ్వింది రజని.

బుర్ర గోక్కున్నారు మాస్టారు.

ఆయనింకేదో అడగనున్నారని గ్రహించి మాట మారుస్తూ అన్నాడు "త్వరగా స్నానం చేసెయ్యండి మాస్టారూ. హైదరాబాదు సైబరాబాదుగా ఎప్పటికన్నా అవుతుందో లేదో గాని నీళ్ల బాధాబాదు గా మాత్రం ఇప్పుడే మారిపోయింది."

"ఇక్కడ త్రాగేనీళ్లకే కాదు వాడకం నీళ్లకీ కరువొచ్చిందన్నమాట. ఏమి నగరాలో ఏవిటో!"

"గోదావరి జీవనదిలో ఈదులాడే మీకలా అన్పించడంలో ఏమాత్రం ఆశ్చర్యంలేదు లెండి"

మరో గంటకి ఇద్దరూ ఇంట్లోంచి బయటపడ్డారు.

"మిమ్మల్ని సెక్రటేరియట్ దగ్గర డ్రాప్ చేసి వెళ్తాను. మీ పనయ్యాక తిన్నగా ఇంటికొచ్చేద్దురుగాని." అన్నాడు శ్రీధర్.

"ఆఫీసు టైము కదా రోడ్లు రద్దీగా వుంటాయి. ఇప్పుడైనా కాస్తంత జాగ్రత్తగా నడుపుతావా శ్రీధరం" కారెక్కి కూర్చుంటూ అన్నారు మాస్టారు.

"మీరేం వర్రీకాకండి మాస్టారూ. మీకేం కానివ్వకుండా గమ్యం చేర్చే పూచీనాది."

"నాకే కాదు నీకూ ఏమీ కాకూడదు."

"నా వెహికల్‌కి కూడా ఏమీకాదు. ఓకే?"

స్టార్ట్ చేస్తూనే ముందుకి దూకించాడు. ఆయన ముఖంలో కనిపించే భయాల్ని చూసి మరీ రెచ్చిపోతున్నట్టుగా డ్రైవ్‌చేశాడు శ్రీధర్.

"స్టీరింగు చక్రం ముందు కూర్చుంటే నీకెవరూ కన్పించరనుకుంటాను" కారు డోర్ తీసి దిగుతూ అన్నారు మాస్టారు.

"ఇది స్పీడు యుగం మాస్టారూ. త్వరగా గమ్యం చేరడం ముఖ్యం. ఎలా చేరామన్నది అప్రస్తుతం."

"అలా అని మరీ ఇంత వేగంగా వెళ్లాలా చెప్పు?"

"దూసుకెళ్లకపోతే మన వెనకాల వచ్చేవాళ్లు దాటించుకెళ్లిపోతారు. మనం వెనకబడిపోతాం. బై..." ఆయన్ని మాటల్తో చిత్తు చేసినందుకు సంతోషిస్తూ కారు స్టార్ట్ చేశాడు.

సాఫ్ట్‌వేర్ కంపెనీ ముందు కారుని పార్కు చేసి లోపలికి నడిచాడు శ్రీధర్.

ఆ బ్రాంచికి మేనేజర్‌గా పనిచేస్తున్నాడతడు. అంచేత స్టాఫ్ అంతా లేచి వినయంగా విష్ చేశారు. "హలో" అంటూ సాదరంగా ప్రతిస్పందించాడు. అంతా నిశ్శబ్దంగా వుండటం చూసి "వాట్ హే పెన్డ్ టు యు ఆల్.." అంటూ కేబిన్లోకి నడిచాడు.

లోపల కంపెనీ యం.డీ.ని చూసి ఖంగుతిన్నాడు. తడబడి విష్ చేశాడు. ఆయన్తో బాటు వున్న మరో ముగ్గురు అధికారులని చూసేసరికి అతడికి ముచ్చెమటలు పోశాయొక్కసారే.

"కొంచెం ముందుగా తెలియజేసుంటే గ్రాండ్ వెల్కం ఆరేంజ్ చేసేవాడ్ని సార్..."

"ఇట్సాల్‌రైట్ మిస్టర్ శ్రీధర్. స్నాప్ ఇన్స్‌పెక్షన్ చేస్తారు. వివిధ డీల్స్‌కి సంబంధించిన ఫైల్సన్నీ చూపించండి" యం.డీ. గంభీరంగా అన్నారు.

ఆయన మాటలకి శ్రీధర్ కాళ్లు చల్లబడ్డాయి. ఢిల్లీలో వుండే యం.డీ. అకస్మాత్తుగా ఇక్కడి బ్రాంచికి రావడమే ఓ విచిత్రం. అన్ని ఫైల్సూ ఇన్‌స్పెక్ట్ చేయిస్తాననడం మరీ చిత్రం. కేవలం చిత్రం మాత్రమే కాదు ప్రమాద సంకేతం కూడా!

స్నాక్సూ టీలూ తెప్పించి హడావిడి చేసి ఫైల్సన్నీ చూపించాడు. ఏ డీల్‌లో ఎంత మిగిలిందో ఏ కంపెనీకి ఏ సాఫ్ట్‌వేర్ అమ్మేరో ఏ ప్రాజెక్టులో ఎంత లాభం వచ్చిందో చకచకా చెప్పేడు. తను మేనేజరయ్యాక ఈ కొద్ది కాలంలో బ్రాంచి ప్రాఫిట్ గ్రాఫ్ ఎలా పైపైకి వెళ్లిందో చూపించాడు.

సాయంత్రం దాకా అన్నీ పరిశీలించారు. శ్రీధర్ అతడి అసిస్టెంట్సూ చెప్పిందంతా మౌనంగా విన్నారు. వెళ్లేముందు యం.డీ. అన్నారు "ఇంచు మించు అన్ని డీల్సులోనూ డిస్కౌంటులిస్తూ పోయారు. కొన్ని రేట్లు మరీ తక్కువకి కోట్ చేశారు. ఎంచేత?"

"కాంపిటేషన్ సార్. ఎలాగైనా ప్రాజెక్ట్ రాబట్టాలనీ..." నసిగాడు శ్రీధర్.

"అంతేనా లేక కిక్‌బాక్స్ ఏమైనా...."

అతడి ముఖంలోని రక్తమంతా పారిపోయింది. ఏ.సి. రూంలో వున్నా ఒళ్లంతా ముచ్చెమటల్తో తడిసిముద్దయింది. ఆఫీసులోని వాళ్లెవళ్లో తనకాళ్లని పట్టుకుని క్రిందికి లాగేసినట్లు అర్థమైపోయింది!

"అది కాద్సార్. మరేమో..."

"నువ్వు తెలివైనవాడివి పట్టుదలగలవాడివి అని చెప్పి బాధ్యతల్ని అప్పగిస్తే..."

"నేనేం చేసినా కంపెనీ బాగు కోసమే చేశాన్సార్..."

"డోంట్ బ్లఫ్. ఉద్యోగంలో చేరేనాటికి నీకున్న ఆస్తిపాస్తులేమిటి ఇవాళున్న ఆస్తిపాస్తులేమిటి? కమాన్ టెల్మీ..." హుంకరించారాయన.

శిలలా బిగుసుకుపోయాడొక్కసారే. ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తోచక తబ్బిబ్బు పడుతూండగానే ఒక లెటర్ అందిచ్చారాయన.

కంపిస్తూ చూశాడు.

సస్పెన్షన్ ఆర్డర్!

"సార్..."

" తర్వాత మాట్లాడుకుందాం. ముందు తాళాల్నీ బాధ్యతల్నీ అతడికప్పగించు" తనతో వచ్చినతడ్ని చూపిస్తూ అన్నారు యం.డీ.

యం.డీ వెళ్లిపోయారు.

అప్పగింతలూ పూర్తయ్యాయి.

ఆఫీసు స్టాఫ్ అంతా తనవంక సానుభూతిగా చూస్తోంటే కళ్లు బైర్లు కమ్ముతోంటే అవమానంతో దహించుకుపోతూ తొలొంచుకుని బయటికి వచ్చేశాడు శ్రీధర్. దుఃఖం పొంగి పొంగి వస్తోంది. నిగ్రహించుకోవడం చాలా కష్టంగా వుంది.

ఎంతో జాగ్రత్తగా వున్నాడు. పావులన్నీ తెలివిగా కదిపాడు. కాని కడకు తను చెక్ అయిపోయాడు!

స్టీరింగ్ ముందు కూర్చుని కారు స్టార్ట్‌చేశాడు. అలవాటు ప్రకారం ముందుకి దూకిందది.

రోడ్లు రద్దీగా వున్నాయి. అయినా కారు వేగంగా దూసుకుపోతూనే వుంది.

మెదడులో విస్ఫోటనాలు చెలరేగుతున్నాయి.

కంపెనీలో చేరి అయిదారేళ్లు కాలేదు. శ్రద్ధగా శక్తి వంచన లేకుండా పనిచేసి అందరి అదరాభిమానాలూ చూరగొన్నాడు. చకచకా మెట్లెక్కేసి మేనేజరు కుర్చీలో బైఠాయించాడు. అతి త్వరలో చుక్కల్ని చూసేద్దామనుకున్నాడు. కానింతలో తన అక్రమ సంపాదన గురించి తెలిసిపోయింది.

అంతా తారుమారయ్యింది!

సడన్‌గా ఓ ప్రక్కనుంచి లారీ దూసుకొచ్చింది. పరధ్యానంగా వున్న శ్రీధర్ సర్రున కారుని ప్రక్కకి కోశాడు. కారు అదుపుతప్పి రెయిలింగ్ బ్రద్దలుగొట్టి పదడుగల క్రిందికి దొర్లుకుపోయింది!

* * *

ఆసుపత్రిలో ఒళ్లంతా కట్లతో కదలలేని స్థితిలో పడివున్నాడు శ్రీధర్.

అతడి శరీరంలోని ఏ భాగానికేమయ్యిందో తెలీని స్థితి దాపురించింది.

రజని బెడ్ పక్కనే కూర్చుని కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. రెసిడెన్షియల్ స్కూల్లో చదువుతోన్న వారి చిన్నారిని తీసుకొచ్చారు. తండ్రి స్థితి చూసి వెక్కిళ్లుపడుతోందా పిల్ల.

తన పరిస్థితి 'అటు' అయితే వాళ్లగతేమిటోనని తల్లడిల్లిపోతున్నాడు శ్రీధర్.

మాస్టారు పరుగుపరుగున వచ్చారు. శ్రీధర్ పరిస్థితికి కదలిపోయారు. డాక్టర్లని కలిసి ప్రాణాపాయం లేదని తెలుసుకునిగాని కుదుటపడలేకపోయారు.

"పోనీలేరా. ఇదీ నీమంచికే అనుకో. నీముందెంతో జీవితం వుంది. ఇకనుంచైనా జాగ్రత్తగా వుండొచ్చు. ఆచి తూచి అడుగెయ్యొచ్చు..."

శ్రీధర్ కళ్లు అశ్రుపూరితాలయ్యాయి.

"ఆఫీసులోని టేబుల్‌మీది అద్దంకిందా, కారులో డాష్ బోర్డుపైనా కుటుంబసభ్యుల ఫోటో పెట్టుకోవాల్రా శ్రీధరం. ఆఫీసులో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా ఒడిదుడుకు పనులకి తలపడకుండా ఆ ఫోటో అదుపులోవుంచుతుంది. అలాగే కారులోని ఫోటో స్పీడ్ బ్రేకర్లా పనిచేస్తుంది. ఆఫీసులోగాని రోడ్డుమీదగాని నీకేమైనా అయితే నీమీద ఆధారపడ్డవాళ్లంతా ఏమవుతారోనన్న స్పృహ నిన్ను స్పృహ కోల్పోకుండా చెక్ చేస్తూంటుంది. నావన్నీ పాత చింతకాయ పచ్చడి కబుర్లనుకో. వినదలిస్తే విను. ఆచరించు. వస్తాన్రా..."

చేతులు జోడించాలనుకున్నాడు. కాని చేతులు సహకరించలేదు.

ఆయన తాబేలులా నడుచుకుంటూ వెళ్లిపోయారు.

దెబ్బతిన్న కుందేలులా మిగిలిపోయాడు శ్రీధర్.

(స్వాతి సపరివార పత్రిక)

4.12.1998

❖ ❖ ❖